శుద్ధి చేసిన నీటిని అందించాలి

సిపిఎం నిరసన

ప్రజాశక్తి - భీమవరం టౌన్

శుద్ధి చేసిన స్వచ్ఛమైన నీటిని ప్రజలకు అందించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. వెంప గ్రామం పెదపేటలో సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ పైపుల ద్వారా ప్రజలకు అందించే తాగునీరు బురదగా వస్తోందని, ఆ నీటి వల్ల అనారోగ్య సమస్యలు వస్తున్నాయని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నీరు శుద్ధి చేసి ప్రజలకు అందించాలని కోరారు. కార్యక్రమంలో మందమార్తమ్మ, కాటికి సంపత్‌రావు, బొడ్డు ఏసేబురాజు, చిలకపాటి శకుంతల, ఇంజేటి మరియమ్మ, చిలకపాటి బేబి, కుర్రం లక్ష్మీ నరసమ్మ పాల్గొన్నారు.

కౌలు కార్డుల లక్ష్యం చేరేదెప్పుడో..!

పశ్చిమలో లక్షా ఐదు వేలు, ఏలూరు జిల్లాలో 75 వేలు టార్గెట్

రెండు జిల్లాల్లో 25 శాతం కూడా పూర్తికాని లక్ష్యం

కౌలు రైతులకు బ్యాంకు రుణాలు, అన్నదాత సుఖీభవ అందేనా?

వర్షాలతో ముమ్మరంగా ఖరీఫ్ సాగు పనులు

దాదాపు తొమ్మిది వేల ఎకరాల్లో నారుమడులు పూర్తి

మెట్ట ప్రాంతంలో ప్రారంభమైన నాట్లు

ఉంగుటూరు మండలం మెట్ట ప్రాంతంలో నాట్లు నాటిన పొలాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఖరీఫ్ సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే మెట్ట ప్రాంతంలో నాట్లు ప్రారంభమవ్వగా, డెల్టాలోనూ మరో వారం, పది రోజుల్లో నాట్లు మొదలుకానున్నాయి. అయినప్పటికీ కౌలుకార్డుల జారీ ప్రక్రియ వేగంగా సాగని పరిస్థితి నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా పరిశీలిస్తే కౌలుకార్డుల జారీ ప్రక్రియలో ఏలూరు జిల్లా మూడు, పశ్చిమ నాలుగో స్థానంలో ఉన్నప్పటికీ తీసుకున్న కౌలుకార్డుల లక్ష్యంలో మాత్రం 25 శాతం కూడా పూర్తికాని పరిస్థితి ఉంది. దీంతో కౌలుకార్డుల జారీ ప్రక్రియ ఎప్పటికి పూర్తవుతుందోననే చర్చ రైతుల్లో సాగుతోంది. ఖరీఫ్‌లో ఏలూరు జిల్లావ్యాప్తంగా 2.50 లక్షల ఎకరాల్లో, పశ్చిమలో 2.15 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపడుతున్నారు. గడిచిన నాలుగైదు రోజులుగా వర్షాలు పడటంతో రెండు జిల్లాల్లోనూ ఖరీఫ్ పనులు ముమ్మరంగా ప్రారంభమయ్యాయి. ఏలూరు జిల్లాలో 11 వేల ఎకరాల్లో నారుమడులు వేయాల్సి ఉండగా ఇప్పటి వరకూ 4,500 ఎకరాల్లో పూర్తయ్యాయి. పశ్చిమలో పది వేల ఎకరాల్లో నారుమడులు వేయాల్సి ఉండగా 3,500 ఎకరాల్లో రైతులు నారుమడులు వేసిన పరిస్థితి ఉంది. తాడేపల్లిగూడెం, ఉంగుటూరు, భీమడోలు వంటి పలు మెట్ట మండలాల్లో బోర్ల కింద వరినాట్లు సైతం ప్రారంభమయ్యాయి. మరో వారం, పది రోజుల్లో డెల్టాలోనూ రైతులు ముమ్మరంగా వరినాట్లు నాటనున్నారు. రెండు జిల్లాల వ్యవసాయ సాగులో 75 శాతం కౌలురైతులే చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ఖరీఫ్ సాగు ప్రారంభ సమయానికి బ్యాంకులు పంటరుణాలు అందించాల్సి ఉంది. అప్పుడే రైతులు పెట్టుబడుల కోసం ఎటువంటి ఇబ్బందులూ పడకుండా ఉంటారు. ఖరీఫ్ సాగు ముమ్మరంగా సాగుతున్నప్పటికీ కౌలుకార్డుల జారీ ప్రక్రియ మందకొడిగా సాగుతోంది.

లక్ష్యం పూర్తయ్యేదెప్పుడు.. కౌలు రైతులకు మేలు జరిగేదెప్పుడు..!

2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం కౌలుకార్డుల జారీ ప్రక్రియ ప్రారంభించి రోజులు గడిచిపోతుంది. పశ్చిమగోదావరి జిల్లాలో లక్షా ఐదు వేలు, ఏలూరు జిల్లాలో 75 వేల కౌలుకార్డులు జారీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకూ ఏలూరు జిల్లాలో 19 వేలు, పశ్చిమలో 13 వేలు వరకూ కౌలుకార్డుల జారీ ప్రక్రియ పూర్తయ్యింది. తీసుకున్న టార్గెట్‌లో 25 శాతం కూడా కార్డుల జారీ కాని పరిస్థితి ఉంది. పూర్తిస్థాయిలో కౌలుకార్డుల జారీ ఎప్పటికి పూర్తవుతుందోననే అనుమానాలు నెలకొన్నాయి. కౌలుకార్డులు ఇస్తే తప్ప బ్యాంకులు పంటరుణాలు ఇవ్వవు. ఈ పరిస్థితుల్లో కౌలురైతులు ఏవిధంగా సాగు సాగించాలో ప్రభుత్వమే చెప్పాలి. గత వైసిపి ప్రభుత్వంలో కౌలుకార్డుల జారీలోనూ, పంట రుణాల మంజూరులోనూ కౌలురైతులకు తీవ్ర అన్యాయం జరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చాక మేలు జరుగుతుందని భావించినా గతేడాది వైసిపి బాటలోనే కూటమి పాలకులు నడిచారు. ఈ ఏడాదైనా కౌలురైతులకు న్యాయం జరుగుతుందని అన్నదాత ఆశలు పెట్టుకున్నాడు. కౌలుకార్డుల జారీ ప్రక్రియ చూస్తే కౌలురైతులకు మళ్లీ మొండిచెయ్యేనా అనే అనుమానాలు నెలకొన్నాయి. కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద కౌలురైతులకు సైతం ఏడాదికి రూ.20 వేలు అందిస్తామని చెప్పింది. ఈ నెలలోనే అన్నదాత సుఖీభవ పథకం నిధులు జమ చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. కౌలుకార్డుల జారీ ప్రక్రియ పూర్తి కాకపోతే కౌలురైతులకు అన్నదాత సుఖీభవ సొమ్ము అందడం సాధ్యం కాదు. బ్యాంకులు పంటరుణాలు సైతం ఇచ్చే పరిస్థితి ఉండదు. ప్రభుత్వం త్వరితగతిన కౌలుకార్డులు జారీచేసి బ్యాంకుల్లో పంటరుణాలు, అన్నదాత సుఖీభవ సొమ్ము అందేలా చేయాలని కౌలురైతులు కోరుతున్నారు.

రాజ్యాంగం, ప్రజాస్వామిక హక్కులను రక్షించుకోవాలి

దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ అమలు

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి

మాట్లాడుతున్న రమాదేవి

ప్రజాశక్తి - భీమవరం

50 ఏళ్ల క్రితం ఏర్పడిన చీకటి చరిత్రకు మించి దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ అమలవుతోందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి అన్నారు. గత 11 ఏళ్లుగా కేంద్రంలో సాగుతున్న పరిపాలనకు స్వస్తి పలకడంతోపాటు రాజ్యాంగం, ప్రజాస్వామిక హక్కులను రక్షించుకునేందుకు ఐక్యంగా ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. స్థానిక ప్యాడీ, రైస్ మర్చంట్స్ భవనంలో సిపిఎం ఆధ్వర్యంలో ఎమర్జెన్సీ నాడు-నేడు అనే అంశంపై మంగళవారం నిర్వహించిన సెమినార్‌కు సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షత వహించారు. ముఖ్యవక్త రమాదేవి మాట్లాడారు. ఇందిరాగాంధీ రాజ్యాంగంలోని 352 అధికరణాన్ని ఉపయోగించి ఎమర్జెన్సీ విధించి 50 ఏళ్లు పూర్తవుతుందన్నారు. ఎమర్జెన్సీ ఉపయోగించి ప్రజల హక్కులను కాల రాసిందన్నారు. అయితే ప్రస్తుత కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎమర్జెన్సీ విధించకుండానే రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, ప్రజానీకం హక్కులను హరిస్తూ అప్రకటిత ఎమర్జెన్సీ అమలు చేస్తుందని విమర్శించారు. గత ఎమర్జెన్సీ సమయంలో ఏర్పడిన పరిస్థితులు, ప్రస్తుత పరిస్థితులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఈ సెమినార్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మోడీ పరిపాలన కూలదోస్తేనే ప్రజాస్వామ్యానికి మంచి రోజులు వస్తాయన్నారు. ఒకపక్క రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ రాజ్యంగాన్ని రక్షిస్తున్నామని చెప్పడం ప్రజలను మోసగించడమేనన్నారు. మతాల మధ్య చిచ్చు పెడుతూ, రాష్ట్రాల హక్కులను హరిస్తోందన్నారు. నిరుద్యోగం, రైతుల ఆత్మహత్యలు వంటి సమస్యలు పక్కనపెట్టి ప్రమాదకరమైన జమిలి ఎన్నికల అంశాన్ని ముందుకు తెస్తుందన్నారు. దేశంలోని ప్రజల సంపదను కొద్దిమంది కార్పొరేట్లకు ప్రయోజనం చేకూర్చేలా మోడీ విధానాలను అవలంబిస్తోందన్నారు. ఎన్‌డిఎ కూటమి నుంచి టిడిపి, జనసేన బయటికి రావాలని రమాదేవి డిమాండ్ చేశారు. గత వైసిపి ప్రభుత్వం బిజెపి విధానాలను రాష్ట్రంలో అమలు చేసిందని, ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వం కూడా తూచ తప్పకుండా పాటిస్తుందని విమర్శించారు. ఉపాధి హామీ నిధుల్లో కోత, సమాచార హక్కు చట్టం నిర్వీర్యం, అటవీ హక్కుల చట్టాన్ని హరిస్తున్నా కనీసం నోరు మెదపట్లేదన్నారు. రైతుల నుంచి భూములు లాక్కొని భూబ్యాంకులు ఏర్పాటు చేస్తున్నారని, కేవలం 99 పైసలకే ఎకరం భూమిని కట్టబెడుతున్నారని విమర్శించారు. మోడీ మతోన్మాద రాజకీయాలపై లౌకిక శక్తులన్నీ పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు గాతల జేమ్స్ సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు, జిల్లా కమిటీ సభ్యులు పి.పూర్ణ, జె.సత్యనారాయణ, కె.క్రాంతిబాబు, గొర్ల రామకృష్ణ, శేషపు అశ్రియ్య, నాయకులు ఎం.వైకుంఠరావు, మల్లిపూడి రామాంజనేయులు, బొక్కా సత్యనారాయణ, పెంకి అప్పారావు పాల్గొన్నారు.

నియంతృత్వ ధోరణిపై పోరాడాలి

జెఎన్‌వి.గోపాలన్, సిపిఎం జిల్లా కార్యదర్శి

బిజెపి నియంతృత్వ పాలన సాగిస్తోంది. దీనిపై ప్రజలు గళం విప్పాల్సిన అవసరం ఉంది. గత ఎమర్జెన్సీని మించి బిజెపి అన్ని తరగతుల ప్రజలపై వివిధ రూపాల్లో దాడులు సాగిస్తోంది. అయినా 2014 నుంచి 2024 వరకు అధికారం చేపడుతూనే ఉంది. గత ఎన్నికల్లో 63 సీట్లు తగ్గించగలిగాం. ప్రతి ఎన్నికల్లో బిజెపి కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి అధికారాన్ని చేజిక్కించుకుంటుంది. భవిష్యత్తులో కూడా ఇవి మరింతగా కొనసాగే ప్రమాదం ఉంది. బిజెపి నియంతృత్వ ధోరణిపై ప్రజలంతా గళం విప్పాలి. ప్రజాస్వామ్య హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. బిజెపి మనుధర్మ శాస్త్రాన్ని అనుసరించి పరిపాలన చేయాలని ప్రయత్నిస్తోంది. దీనికి వ్యతిరేకంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైంది.

మేధావులు ఆలోచించాలి

గుండా రామకృష్ణ, ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాట నాయకులు

ఎమర్జెన్సీ సమయంలో మనుషులు కన్పించేవారు కాదు. కరపత్రాలు, కొరియర్ సర్వీస్‌లు, సమావేశాల ద్వారా సమాచారం తెలిసేది. సమావేశాల్లో ఎక్కువగా పాల్గొంటూ ఉండేవాణ్ణి. ఆ రోజుల్లో నా కోసం పోలీసులు గాలించి ఇంటికి వచ్చారు. ఆ సమయంలో మా కుటుంబం భయభ్రాంతులకు గురైంది. ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ ప్రకటించింది. అయితే మోడీ ప్రభుత్వం ఎమర్జెన్సీ ప్రకటించకుండానే అమలు చేస్తుంది. మేధావులు ఆలోచన చేయాలి. స్వచ్ఛందంగా ఉద్యమాలు, పోరాటాలు చేయాలి. ఎమర్జెన్సీని గుర్తు చేసేందుకు సిపిఎం సెమినార్ నిర్వహించడం అభినందనీయం.

బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలి

సచివాలయ ఉద్యోగుల వినతి



వీరవాసరంలో ఎంపిడిఒకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

ప్రజాశక్తి - వీరవాసరం

సచివాలయ ఉద్యోగుల బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలని ఎపిజిఇఎ ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు ఎంపిడిఒ అప్పారావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. బదిలీల ప్రక్రియలో ఉద్యోగికి సొంత మండలంలో కోరుకునేలా అవకాశం కల్పించాలని కోరారు. రేషన్‌లైజేషన్ పారదర్శకంగా అమలు చేయాలని, మిగులు సిబ్బందికి సంబంధించి స్పష్టమైన విధివిధానాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎపిజిఇఎ జిల్లా అధ్యక్షులు వై.మోహన్‌రావు, భీమవరం తాలూకా వైస్ ప్రెసిడెంట్ కె.ఆదిత్య, నేతలు పాల్గొన్నారు.

గణపవరం: ప్రభుత్వం జిఒ నెం.5ను సవరించాలని, సచివాలయ ఉద్యోగులను సొంత మండలంలో నియమించరాదనే నిబంధనలు తొలగించాలని కోరుతూ మంగళవారం మండలంలో సచివాలయ ఉద్యోగులు ఎంపిడిఒ ఆర్.బేబిశ్రీలక్ష్మికి వినతిపత్రం అందజేశారు.

ఉండి: సచివాలయ ఉద్యోగుల బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలని ఉండి మండల సచివాలయ ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. తహశీల్దార్ కావడి నాగార్జున, ఎంపిడిఒ ఎంవివిఎస్.శ్రీనివాస్‌లకు వారు మంగళవారం వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మణి దీపక్, సుధాకర్, గంగాధర్, రాజు, శ్రీకాంత్, బాలు తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ ఎంఆర్.రాజు మృతి

ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

ప్రజాశక్తి - కాళ్ల

పెదఅమిరం గ్రామానికి చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ శాస్త్రవేత్త, కేన్సర్ ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ ముదుండి రామకృష్ణరాజు (ఎంఆర్.రాజు) తుది శ్వాస విడిచారు. వయోభారంతో బాధపడుతున్న ఆయన మంగళవారం తెల్లవారుజామున పెదఅమిరంలోని స్వగృహంలో కన్నుమూశారు. ఆయన సతీమణి గతంలోనే మృతి చెందారు. ఎంఆర్.రాజుకు ఇద్దరు కుమారులు. రాజు భౌతికకాయాన్ని భీమవరంలో బలుసుమూడి శ్మశానవాటికకు తరలించి, ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

ఎంఆర్.రాజు భౌతికకాయానికి డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు నివాళులర్పించారు. అలాగే జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి రాజు పార్థివదేహానికి పూలదండ వేసి నివాళులర్పించారు. పాలకొల్లు మాజీ ఎంఎల్‌ఎ డాక్టర్ త్సవటపల్లి సత్యనారాయణమూర్తి (బాబ్జీ), సర్వోదయ మండలి నాయకులు ఇందుకూరి ప్రసాద్‌రాజు, శశి స్కూల్ మురళి, రాయప్రోలు భగవాన్, పేరిచర్ల లక్ష్మణవర్మ, డిఎన్ఆర్ నాగరాజు, గోకరాజు పెదబాబు, చినబాబు, పద్మావతి వెంకటేశ్వర దేవస్థానం ఇఒ ముదునూరి సత్యనారాయణరాజు, దండు వెంకట కృష్ణంరాజు తదితరులు ఎంఆర్.రాజు భౌతికకాయానికి నివాళులర్పించి, కుమారులు రామకుమార్‌రాజు, రంగరాజు, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నివాళులర్పిస్తున్న జెసి



ఎంఆర్.రాజు

ఎంఆర్ రాజు జీవిత నేపథ్యం

ఎంఆర్.రాజు పెదఅమిరంలో 1931లో జన్మించారు. 1961 నుండి అమెరికాలో ప్రసిద్ధి చెందిన లేబరేటరీల్లో న్యూక్లియర్ పార్టికిల్స్తో కేన్సరు చికిత్సపై పరిశోధన సాగించారు. 1961-63లో అమెరికాలోని మేసచూసెట్స్ జనరల్ హాస్పిటల్లో పని చేసే అవకాశం లభించింది. 1963-71 కాలంలో కాలిఫోర్నియా, బర్కిలీలో లారెన్స్ రేడియేషన్ లేబరేటరీలోనూ, 1971-1994లో లాస్ ఆలమోస్ నేషనల్ లేబరేటరీలోనూ పరిశోధనలు సాగించారు. ప్రొఫెషనల్ స్టాఫ్ కేవలం ఒకటి లేక రెండు శాతం మందికి మాత్రమే లభించే ప్రతిష్టాత్మకమైన లాస్ ఆలమోస్ ఫెలోగా డాక్టర్ రాజు గుర్తింపు పొందారు. గ్రామీణ ప్రజల విద్య, ఆరోగ్య అభివృద్ధికి తోడ్పడేందుకు పెదఅమిరంలో మహాత్మాగాంధీ మెమోరియల్ మెడికల్ ట్రస్ట్ నెలకొల్పారు. దీనిలో పూర్తిస్థాయిలో సేవలందించేందుకు డాక్టర్ రాజు లాస్ ఆలమోస్ నేషనల్ లేబరేటరీ నుండి ఉద్యోగ విరమణ చేశారు. ఆయన పలు డాక్టరేట్లు, సత్కారాలు పొందారు. డాక్టర్ ఎంఆర్ రాజు సేవలు గుర్తించి అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం 2006లో పెదఅమిరం ఎంజిఎం ట్రస్ట్‌ను సందర్శించారు. అప్పటి రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ చేతుల మీదుగా 2013లో పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు.

పాఠశాలలను యథాతథంగా కొనసాగించాలి

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని పెనుమంట్ర ఎల్ఇ, ఓడూరు యుపి పాఠశాలల్లోని విద్యార్థులను దూరంగా ఉన్న ఇతర పాఠశాలల్లో విలీనం చేయడం తగదని, దీనివల్ల పేద, దళిత, బలహీనవర్గాలకు చెందిన పిల్లలు విద్యకు దూరమవుతున్నారని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. మంగళవారం మధ్యాహ్నం పెనుమంట్ర ఎల్ఇ పాఠశాల ఉన్న లూథరన్ చర్చి ఏరియా, ఓడూరు యుపి పాఠశాల ఉన్న దళితవాడ, మార్టేరు శివారు శివరావుపేట ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో ఆమె మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెనుమంట్ర శివారు బ్రాహ్మణచెరువు మెయిన్ పాఠశాలకు వెళ్తున్న స్థానిక మందులువారి కాలనీని రమాదేవి సందర్శించి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. వారు మాట్లాడుతూ సూర్యారావుపేట స్కూల్‌ను బ్రాహ్మణచెర్వు మెయిన్ పాఠశాలలో విలీనం చేయడం వల్ల తమ పిల్లలు నిత్యం రద్దీగా ఉండే అత్తిలి-మార్టేరు రాష్ట్రీయ రహదారి గుండా సుమారు కిలోమీటరుకు పైగా నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తుందని వాపోయారు. ఎప్పటిలానే ఇక్కడి స్కూల్ కొనసాగించాలని కోరారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ ప్రభుత్వం ఓ పథకం ప్రకారం ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తోందన్నారు. దీనికి నిదర్శనం ఈ మండలంలోని స్కూళ్ల విలీనమేనని అన్నారు. ప్రభుత్వం తక్షణమే పాఠశాలల విలీనం ఆపి, పాత పద్ధతిలోనే అన్ని పాఠశాలలను నడపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కేతా పద్మజ, పొగాకు పూర్ణ, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కూసంపూడి సుబ్బరాజు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

రమాదేవికి వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

15 రోజుల్లో గృహ నిర్మాణ లక్ష్యం పూర్తి చేయాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో గృహ నిర్మాణాల లక్ష్యాన్ని 15 రోజుల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశాలు జారీ చేశారు. గృహ నిర్మాణాల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గృహనిర్మాణ ప్రగతిపై ఆమె మండలాలవారీ సంబంధిత అధికారులతో సమీక్షించారు. నిర్దేశించిన లక్ష్యాలు సాధించకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. నిర్మాణాల్లో అలసత్వం వహించే కాంట్రాక్టర్లను తొలగించి అవసరమైతే కొత్తవారిని నియమించి పనులు వేగవంతం చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో లబ్ధిదారులను కలసి వారికి అవగాహన కల్పించాలన్నారు. మరో 15 రోజుల్లో లక్ష్యాన్ని పూర్తి చేసి నివేదికను సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో గృహనిర్మాణ శాఖ పీడీ జి.పిచ్చయ్య, జిల్లాలోని డిఇలు, ఎఇలు పాల్గొన్నారు.

వసతి గృహాలను తనిఖీ చేసిన కలెక్టర్

ఉండి: ఉండిలోని ఎస్‌సి బాలికల వసతిగృహం, బిసి కళాశాల వసతి గృహాలను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. బాలుర వసతిగృహంలో పలువురు విద్యార్థులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. మోటార్ సరిగా పని చేయక నీరు అందట్లేదని, ఇటీవల కాలంలో విద్యుత్ కోతలు ఎక్కువగా ఉన్నాయని, ఇన్వర్టర్ పని చేయకపోవడం వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. వెంటనే ఈ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. లైబ్రరీ, క్యారమ్ బోర్డు ఏర్పాటు చేయాలని తహశీల్దార్‌కు సూచించారు. బాలికల వసతి గృహంలో వంటలు రుచి చూశారు. అనంతరం ఉండి మార్కెట్లో పర్యటించి కూరగాయలు, పూలు, విత్తనాల ధరలను అడిగి తెలుసుకుని విత్తనాలను కొనుగోలు చేశారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ కావడి నాగార్జున, ఎంపిడిఒ ఎంవివిఎస్.శ్రీనివాస్, ఆర్ఐ రేవు కార్తీక్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

పేదల ఆకలి తీర్చేందుకే అన్నా క్యాంటీన్లు

ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ

ప్రజాశక్తి - ఆచంట

పేదవాడి ఆకలి తీర్చేలా తక్కువ ధరకే నాణ్యమైన భోజనం అందించేందుకు అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ తెలిపారు. స్థానిక కచేరి సెంటర్‌లో రూ.61 లక్షల వ్యయంతో నిర్మించనున్న అన్న క్యాంటీన్‌కు ఆయన మంగళవారం శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా పితాని మాట్లాడుతూ త్వరలోనే భవన నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మరో 60 అన్న క్యాంటీన్లు అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు, టిడిపి మండలాధ్యక్షుడు చిలుకూరి సీతారాం, సిద్ధాంతం డిసి ఛైర్మన్ తమ్మినీడి ప్రసాద్, జనసేన మండలాధ్యక్షుడు జవ్వాది బాలాజీ శ్రీనివాస్, ఎంపిటిసి సభ్యురాలు దాసిరెడ్డి పుణ్యవతి, తమ్మినీడి పృధ్వీ, కేతా మీరయ్య, గొడవర్తి శ్రీరాములు, బీరా నరసింహమూర్తి, చిలుకూరి సత్యవతి, మన్నే విజయ రాధిక, తహశీల్దార్ జి.కనకరాజు, ఎంపిడిఒ కృష్ణమోహన్, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటికి వేంద్ర విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - పాలకోడేరు

వేంద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటికి ఎంపికయ్యారు. ఇటీవల పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన కేతా సుమ 572 మార్కులు, రేలంగి భరత్ కుమార్ 572 మార్కులు సాధించి ట్రిపుల్ ఐటిలో సీటు దక్కించుకున్నారు. దీనిలో భాగంగా స్థానిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులు ట్రిపుల్ ఐటిలో సీటు సాధించిన విద్యార్థులకు స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జివివి.శ్రీనివాసు మాట్లాడుతూ ట్రిపుల్ ఐటిలో సీటు సాధించిన విద్యార్థులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.వెంకటరమణ, జె.శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసరావు, రాజవర్ధని, శ్రీధర్, సుభోసుబాబు, పార్వతి, వరలక్ష్మి, రాధ, సాయిబాబు, నాగుబాబు, ఫణిరాజేష్, విశ్వనాథరాజు, సునీల్ పాల్గొన్నారు.

కేతా సుమ

రేలంగి భరత్ కుమార్

ట్రిపుల్ ఐటికి సత్య చంద్రశేఖర్

ప్రజాశక్తి - మొగల్తూరు

ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఒంగోలులోని ట్రిపుల్ ఐటికి ఎంపికయ్యాడని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.రామరాజు తెలిపారు. పాఠశాలకు చెందిన బైనపాలెం సత్య చంద్రశేఖర్ తమ పాఠశాల నుంచి ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌ను సర్పంచి అడ్డాల సూరిబాబు, ఎంపిటిసి స్వామి విద్యా కమిటీ ఛైర్మన్ చూడామని, పాఠశాల సిబ్బంది అభినందించారు.

సత్య చంద్రశేఖర్

పలు చోట్ల వర్షం

మొగల్తూరు: మండలంలో మంగళవారం ఉదయం నుండి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. కొద్దిరోజులుగా అధిక ఉష్ణోగ్రతల కారణంగా అల్లాడిన ప్రజలు వర్షంతో సేదతీరారు. వాతావరణంలో మార్పులతో ఆక్వా చెరువుల్లో ఆక్సిజన్ శాతం పడిపోవడంతో ఏరియేటర్లు ఏర్పాటు చేయడానికి, తిప్పడానికి రైతులు పరుగులు తీశారు. సాయంత్రం వరకు చిరుజల్లు కురవడంతో రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి.

పాలకొల్లు: పాలకొల్లులో మంగళవారం వాతావరణం పూర్తిగా చల్లబడింది. మధ్యాహ్నం నుంచి మూడు గంటల పాటు ఎడతెరిపి లేకుండా చినుకులు పడ్డాయి. దీంతో భవన నిర్మాణ పనులు చల్లని వాతావరణంలో బాగా జరిగినట్లు చెబుతున్నారు. రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు.

భాష్యం విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గణేష్

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం భాష్యం చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బి. గణేష్ డిమాండ్ చేశారు. స్థానిక వన్‌టౌన్ భాష్యం స్కూల్లో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న విద్యా సామగ్రి అమ్మకాన్ని మంగళవారం ఎస్ఎఫ్ఐ అడ్డుకుంది. భాష్యం యాజమాన్యాన్ని నిలదీసి ఆందోళన చేపట్టింది. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ పట్టణంలో పలు కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థలు విద్యార్థుల తల్లిదండ్రులను విద్యా సామగ్రి రూపంలో దోచుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పుస్తకాలను స్కూల్లోనే కొనాలని తల్లిదండ్రులను ఒత్తిడి చేస్తూ, అసలు ధర కంటే రెండు నుంచి మూడు రెట్లు అధికంగా అమ్ముతూ తల్లిదండ్రుల జేబులు గుల్ల చేస్తున్నాయని విమర్శించారు. గతంలో భాష్యం స్కూల్లో జరుగుతున్న అక్రమ వ్యాపారాన్ని అడ్డుకుని విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకున్నప్పటికీ మళ్లీ అక్రమ వ్యాపారం సాగిస్తున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు పూర్తిగా కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. ఆందోళన విషయం తెలుసుకున్న జిల్లా విద్యాశాఖ అధికారి, కార్యాలయ సిబ్బంది స్కూల్ వద్దకు చేరుకుని పుస్తకాల గదిని పరిశీలించి సీజ్ చేశారు. దీంతో ఎస్ఎఫ్ఐ నేతలు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ నాయకులు సాయి తేజ, నాగేంద్ర, సాయికృష్ణ, రోహిత్, హేమంత్ పాల్గొన్నారు.



పుస్తకాల గదిని సీజ్ చేస్తున్న అధికారులు



తణుకు : నిరసన వ్యక్తం చేస్తున్న నేతలు

కొనసాగిన మున్సిపల్ సిబ్బంది దీక్షలు

ప్రజాశక్తి - తణుకు

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం రూ.29 వేలు అమలు చేయాలని ఎపి మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ (తణుకు మున్సిపాలిటీ) అధ్యక్షులు ఉండ్రాజవరపు శ్రీను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. న్యాయమైన సమస్యలను పరిష్కరించాలంటూ మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ (జెఎసి) ఆధ్వర్యంలో సమ్మె రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి గెల్లా విజయకుమార్ మాట్లాడుతూ 10 సంవత్సరాలు పైబడిన ఇంజినీరింగ్ మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, హెల్త్ పాలసీ అమలుచేయాలని, కనీస పెన్షన్ రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పి.శ్రీదేవి, పి.దానం, పి.పెద్దిరాజు, డి.సత్యనారాయణ పాల్గొన్నారు.

నరసాపురం : కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తయినా కాంట్రాక్ట్ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలపై స్పందించకపోవడం దారుణమని వైసిపి నరసాపురం నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు యర్రా శ్రీను అన్నారు. మంగళవారం నరసాపురం మున్సిపల్ ఉద్యోగుల దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించారు. చాలీచాలని జీతాలతో కాలం నెట్టుకొస్తున్న ఉద్యోగులకు జీతాలు పెంచాలని, వారి సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. రత్నం, శ్యామ్, కాశీ, వి.ఫణి, ఎం.సత్యనారాయణ, మధు, సుజాత, అను, జి.ప్రసాద్, వాసు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రజలందరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని బిజెపి నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ అన్నారు. మంగళవారం ఎల్అండ్‌టి కాలనీ క్రీస్తు సంఘం చర్చి ఆధ్వర్యంలో చక్కా బజార్, మరియ దంపతుల జ్ఞాపకార్థం నిడదవోలు రాజేశ్వరి నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో 144 మందికి డాక్టర్ బి.రూప ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా తాతాజీ మాట్లాడుతూ రక్తాల నాగ బుజ్జి స్వచ్ఛందంగా ప్రజలకు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. తామూ చిన్న మొత్తాలు క్రీస్తు సంఘం చర్చి ట్రస్ట్ ద్వారా ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు బాలకృష్ణ, వివిఎస్.జానకిరాముడు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్వా రైతులు గ్రామ సభలను ఉపయోగించుకోవాలి

ఎఫ్‌డిఒ శివ రామకృష్ణ

ప్రజాశక్తి - గణపవరం

ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామ సభలను ఉపయోగించుకుని ఆక్వా రైతులు తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ఎఫ్‌డిఒ శివరామకృష్ణ తెలిపారు. మంగళవారం ఆక్వా జోనేషన్ గ్రామ సభ ప్రారంభం సందర్భంగా గణపవరం, పిప్పర, కేశవరం, సరిపల్లి, ముప్పర్తిపాడు, జల్లికాకినాడ గ్రామాల్లో జరిగిన గ్రామ సభల్లో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ తీరానికి నుంచి 200 వరకూ నాన్ ఆక్వా సర్వే నెంబర్లు గుర్తించినట్లు తెలిపారు. 40 ఎకరాలు కొత్తగా గుర్తించినట్లు తెలిపారు. గణపవరం సర్పంచి మూర అలంకారం, పిప్పర సర్పంచి కాకర బేబి, ముప్పర్తిపాడు సర్పంచి కర్రి రాధాలక్ష్మి, జల్లికాకినాడ సర్పంచి నాగేశ్వరరావు ఉన్నారు.

వాసవీలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

జెఎన్‌టియు కాకినాడలోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం, తాడేపల్లిగూడెం వాసవీ ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగాలు అడ్వాన్సెస్ ఇన్ సిగ్నల్ అండ్ ఇమేజ్ ప్రాసెసింగ్ మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ టెక్నిక్స్ అంశంపై నిర్వహిస్తున్న ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ మంగళవారం ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపల్ రత్నకిరణ్ తెలిపారు. జెఎన్‌టియుకె ఇసిఇ విభాగం ఆచార్యులు దుర్గా గంగారావు, నిట్ వరంగల్ డాక్టర్ సిహెచ్.రామారావులు వివిధ కళాశాలల నుండి హాజరైన అధ్యాపకులకు సిగ్నల్ అండ్ ఇమేజ్ ప్రాసెసింగ్‌పై వివరించారు. నిట్ ప్రొఫెసర్ పి.కోటేశ్వరరావు, న్యూరల్ నెట్‌వర్క్స్ బెస్ట్ రాడార్ సిగ్నల్ ప్రాసెసింగ్ గురించి వివరించారు. కళాశాల పాలక వర్గ అధ్యక్షులు గ్రంధి సత్యనారాయణ, కార్యదర్శి చలంచర్ల సుబ్బారావు, ప్రిన్సిపల్ రత్నకిరణ్, టెక్నికల్ డైరెక్టర్ అప్పారావు పాల్గొన్నారు.

పిహెచ్‌సిల్లో వైద్యాధికారుల నియామకం

పెనుమంట్ర: గడిచిన నెలరోజులుగా పైగా ఇన్‌ఛార్జి డాక్టర్‌తో నడిచిన పెనుమంట్ర పిహెచ్‌సిలో కొత్తగా ఇద్దరు వైద్యాధికారులు మంగళవారం విధుల్లో చేరారు. భీమవరం జిల్లా వైద్య ఆరోగ్య కేంద్రం నుంచి డాక్టర్ ఎస్.సంతోష్‌రెడ్డి, మంచిలి పిహెచ్‌సి నుంచి డాక్టర్ టి.కిరణ్మయి సాధారణ బదిలీలో ఇక్కడకు వచ్చారు. విధుల్లో చేరిన ఇద్దరు కొత్త వైద్యాధికారులను ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఎఎన్ఎం, ఆశా, అంగన్‌వాడీలు శుభాకాంక్షలు తెలిపారు.

మొగల్తూరు: మొగల్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంపిహెచ్ఇఒగా కోళ్ల భాస్కరరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. భీమవరంలోని మలేరియా సబ్ యూనిట్ కార్యాలయం నుంచి మొగల్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఆయన వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పిహెచ్‌సిలో నూరు శాతం ప్రసవాలు జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎఎస్ఎన్.మూర్తి భీమవరంలోని మలేరియా సబ్ యూనిట్ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

విద్యార్థులకు అక్షరాభ్యాసం

ప్రజాశక్తి - వీరవాసరం

రాయకుదురు కపుర వారి వీధిలో మండల పరిషత్ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. 14 మంది విద్యార్థులకు ఆనందం బాలాజీ, జయలక్ష్మి సూర్య వెంకటేశ్వరరావు, పుల్లారావు పిఎంసి ఛైర్మన్ కపురు రమేష్ సహకారంతో నోట్ పుస్తకాలు అందజేశారు. అదే విధంగా సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర కిట్లు, యూనిఫారాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి గెడ్డం భారతీభాస్కరరావు, వైస్ ఎంపిపి అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, కడలి నెహ్రూ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఇద్దరు మహిళలపై వీధి కుక్క దాడి

భయాందోళనలో స్థానికులు

ప్రజాశక్తి - పాలకోడేరు

కుక్క దాడిలో గాయాలపాలైన బాధతురాలు

పాలకోడేరులో వీధి కుక్క ఇద్దరు మహిళలపై దాడి చేసింది. దీంతో మహిళలు తీవ్ర గాయాల పాలయ్యారు. తూర్పుపేట బిసి కమ్యూనిటీ హాల్ సమీపంలో తొంట సీతమ్మ, అనిమిరెడ్డి అన్నమ్మ నివాసం ఉంటున్నారు. ఇదే ప్రాంతంలో వీధి కుక్క గతం నుంచి సంచారం చేస్తోంది. ఇటీవల చిన్నారులపై వీధి కుక్క దాడికి ప్రయత్నించడంతో స్థానికులు దూరంగా తరిమేశారు. అయితే మంగళవారం సీతమ్మ ఇంట్లో మంచంపై నిద్రిస్తుండగా మంచం కింద ఉన్న కుక్క ఒక్కసారిగా దాడి చేసింది. రెండు అరచేతులు, కాళ్లపై కరిచేసింది. ఆ సమయంలో కేకలు వేసినప్పటికీ చుట్టుపక్కల ఎవరూ లేరని సీతమ్మ వాపోయింది. అయితే అదే సమయంలో కొట్టు దగ్గరికి వెళ్లి వస్తున్న అన్నమ్మపై కుక్క దాడి చేసింది. దీంతో అన్నమ్మ కింద పడిపోవడంతో కుక్క మీదపడి బట్టలు చించేయడంతోపాటు కాళ్లపై కరిచింది. అన్నమ్మ కేకలు వేయడంతో స్థానికులు కుక్కను చెదరగొట్టారు. అక్కడ నుంచి వెళ్లిపోయిన కుక్క కట్టి ఉన్న లేక దూడపై దాడి చేసింది. దీంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

నిరుపయోగంగా రైతు సేవా కేంద్రం..!

ప్రజాశక్తి - ఉండి

నిరుపయోగంగా ఉన్న రైతు సేవా కేంద్రం

రైతులకు స్థానికంగానే ప్రయోజనాలు చేకూర్చేందుకు గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన రైతు సేవా కేంద్రం అధికారుల లేమితో నేడు నిరుపయోగంగా మారి మూత పడింది. వివరాల్లోకి వెళితే.. ఉండి మండలం పెదపుల్లేరు గ్రామంలో ఉపాధి హామీ నిధులు సుమారు రూ.24 లక్షలతో రైతు భరోసా కేంద్రాన్ని నిర్మించి, 2024 మార్చిలో ప్రారంభించారు. గ్రామ వ్యవసాయ సహాయకులుగా పనిచేస్తున్న కరణం పరంజ్యోతి ఇటీవల ఉద్యోగోన్నతిపై ఉండి వ్యవసాయ కేంద్రానికి బదిలీపై వచ్చారు. అయితే సుమారు నెల రోజుల నుంచి రైతుసేవా కేంద్రం మూసివేసి ఉన్నట్లు స్థానికులు తెలిపారు. అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ వంటి పథకాలకు రైతులు రైతుసేవా కేంద్రంలో వేలిముద్ర వేయాలని అధికారులు, ప్రభుత్వం ప్రచారం చేస్తుండగా సుమారు 719 ఎకరాల వ్యవసాయం చేస్తున్న రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని పలువురు వాపోతున్నారు. దీనిపై మండల వ్యవసాయాధికారి కార్యాలయ సిబ్బందిని వివరణ కోరగా పెదపుల్లేరు గ్రామ వ్యవసాయ సహాయకులుగా పనిచేస్తున్న కరణం పరంజ్యోతి ఉద్యోగోన్నతిపై ఉండి వచ్చారని, దీనివల్ల పెదపుల్లేరు రైతుసేవా కేంద్రానికి ఇన్‌ఛార్జిగా చెరుకువాడ గ్రామ సహాయకుడిని నియమించారని, అతనికి అక్కడ పని భారం ఎక్కువగా ఉండటం వల్ల పెద్దపుల్లేరు అప్పుడప్పుడు వచ్చి వెళ్తున్నారని తెలిపారు. రైతులు జిఎస్‌డబ్ల్యూఎస్ యాప్‌లో నమోదు అయితే వారు అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులేనని, వారు రైతు సేవా కేంద్రంలో కచ్చితంగా వేలిముద్ర వేయాల్సిన అవసరం లేదని వ్యవసాయ కార్యాలయ సిబ్బంది తెలిపారు.

విద్యకు ప్రభుత్వం పెద్దపీట

డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు

ప్రజాశక్తి - కాళ్ల

రోడ్డును ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు

కూటమి ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోందని, అన్ని సౌకర్యాలూ కల్పిస్తోందని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామ కృష్ణరాజు అన్నారు. మంగళవారం మాలవానితిప్ప, గోగుతిప్ప గ్రామాల్లో ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. గోగుతిప్ప, మాలవానితిప్ప గ్రామాల్లో ఎంజి ఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.10 లక్షలు, జెడ్‌పి నిధులు రూ.15 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.12 లక్షలతో సుమారు రూ.37 లక్షలతో నిర్మించిన నాలుగు సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. మాలవానితిప్ప హైస్కూల్లో మనబడి - మన భవిష్యత్తు ఫేజ్ 2 కార్యక్రమంలో పది అంశాలు, ఐదు తరగతి గదులకు రూ.98 లక్షల 59 వేల నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతానికి రూ.53 లక్షల 40 వేల వ్యయంతో మూడు అదనపు తరగతి గదులు వివిధ సౌకర్యాలు ఏర్పాటు చేసినవి ప్రారంభించారు. దాత ఆర్థిక సహకారంతో 5.50 లక్షల రూపాయలతో నిర్మించిన షెడ్డును ప్రారంభించారు. అనంతరం ఎంఎల్ఎ మాట్లాడుతూ ప్రభుత్వ నిధులతో పాటు దాతల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. పాఠశాల అభివృద్ధికి ఇంకా రూ.40 లక్షలతో పనులు చేసేందుకు నిధులు తెచ్చుకోవాల్సి ఉందన్నారు. డ్రెయినేజీ నిర్మాణం రూ.20 లక్షలతో చేయాల్సి ఉందన్నారు. మిత్రుల సాయంతో కంప్యూటర్ ల్యాబ్‌లు నియోజకవర్గంలోని 24 హైస్కూళ్లలో 3 నెలల్లో ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చానని, నెరవేరుస్తానని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి సాగిరాజు సుబ్బరాజు, మాజీ సర్పంచి మంతెన వెంకట్రాజు, మాజీ ఎంపిపి ఆరేటి వెంకట రత్నప్రసాద్, నీటి సంఘం అధ్యక్షులు మంతెన సూర్యనారాయణ రాజు, మాజీ అధ్యక్షులు మంతెన రంగరాజు, టిడిపి నాయకులు సాగిరాజు సోమరాజు, వేగేశ్న ఉమా పాల్గొన్నారు.

రూ.53 లక్షలతో సీసీ రోడ్లకు శంకుస్థాపన : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వచ్చే నాలుగేళ్ల పాటు తాడేపల్లిగూడెం నియోజకవర్గ అభివృద్ధి పైనే దృష్టి కొనసాగుతుందని శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక 19వ వార్డులో శంకర్ భవాని, మద్దుల సూర్యారావు వీధుల్లో రూ.53 లక్షలతో సీసీ రోడ్లకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పురపాలక సంఘం నిధుల దుర్వినియోగంలో సిఎఫ్ఎంఎస్ ద్వారా వైసిపి నాయకులు అవినీతికి పాల్పడ్డారని, అటువంటివారు నేడు వారి సైకో పాలనను మరోసారి మైకుల ద్వారా చెప్పుకుని రాక్షస ఆనందం పొందుతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గత ప్రభుత్వ పాలనలో అవినీతికి పాల్పడిన సిఎఫ్ఎంఎస్ నిధులను రద్దుచేసి నిధి పోర్టల్ ద్వారా పురపాలక సంఘంలో వచ్చిన ఆదాయాన్ని నియోజకవర్గ అభివృద్ధికి వినియోగించుకునే అవకాశం కల్పించారని తెలిపారు. రూ.60 కోట్లతో ఎస్ఎస్ ట్యాంక్ నిర్మాణం, నాలుగేళ్లలో సిసి రోడ్ల నిర్మాణం, నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ కుళాయిని అందించే కార్యక్రమాలను పూర్తి చేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో బిజెపి కన్వీనర్ ఈతకోట తాతాజీ భవన నిర్మాణ, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ ఉలవల బాబ్జి, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ గొర్రెల శ్రీధర్, వర్ధన పల్లి కాశీ పాల్గొన్నారు.

అత్యుత్తమ రాజధాని అమరావతి

ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ

ప్రజాశక్తి - ఆచంట

అమరావతిని ప్రపంచంలోనే అత్యుత్తమ రాజధానిగా కూటమి ప్రభుత్వం నిర్మిస్తోందని ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. మంగళవారం కరుగోరుమిల్లి, కందరవల్లిలో పల్లె పల్లెకూ మన పితాని కార్యక్రమం జరిగింది. పితాని మాట్లాడుతూ రూ.39 వేల కోట్లతో అమరావతి రాజధాని పూర్తి చేయడానికి టెండర్లను కూడా ప్రభుత్వం పిలిచిందన్నారు. వచ్చే ఎన్నికల నాటికి 80 శాతం రాజధాని నిర్మాణ పనులు పూర్తి చేస్తామన్నారు. సంక్షేమ పథకాల అమల్లో టెక్నికల్ సమస్యలు లబ్ధిదారులకు శాపాలు కాకుండా అధికారులు ప్రజలకు పూర్తిగా సహకరించాలన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో పోలవరం నిర్మాణం పూర్తి చేస్తామని అన్నారు. అనంతరం నూతనంగా నిర్మించిన బస్సు షెల్టర్‌ను, అంగన్వాడీ కేంద్రాన్ని ఎంఎల్ఎ ప్రారంభించారు. గ్రామ సర్పంచి అల్లం పద్మావతి, కందరవల్లి సర్పంచి బోడపటి బులియ్య, జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు, అధికారులు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న ఎడిఎ శ్రీనివాస్

పాలకోడేరులో 'పొలం పిలుస్తుంది'

పాలకోడేరు : పాలకోడేరులో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎడిఎ సిహెచ్ శ్రీనివాస్ రైతులకు పలు సూచనలు సలహాలు అందజేశారు. ముఖ్యంగా సాగులో తీసుకునే మెలకువలు వివరించారు. సాగును ప్రణాళికాబద్ధంగా చేయడం ద్వారా పంటను రక్షించుకోవడంతోపాటు అధిక దిగుబడులు సాధించేందుకు తోడ్పాటు ఇస్తుందన్నారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉందని రైతులు వ్యవసాయ పనులు తరగతిగతిన చేపట్టాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి బి.సంధ్య మాట్లాడుతూ మండలంలో 11,280 ఎకరాల్లో సార్వాసాగు చేపట్టడం జరిగిందన్నారు. 564 ఎకరాల నారుమడులు అవసరం కాగా ఇప్పటివరకూ 50 ఎకరాల్లో నారుమడులు వేయడం జరిగిందని తెలిపారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి సాగులో మంచి దిగుబడులు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు శంభునిపేటలో అక్రమంగా స్పిరిట్‌కు ప్రమాదకర ఎసెన్స్ కలిపి అక్రమంగా మద్యం వ్యాపారం చేస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి రూ.10 లక్షల విలువైన సామగ్రి, మిషన్ స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బోయపాటి శ్రీలత చెప్పారు. మంగళవారం మీడియాతో ఆమె మాట్లాడారు. ఈ దాడిలో పులి రోహిత్ శీతల్‌ను అరెస్ట్ చేశామని చెప్పారు. ఆయన వద్ద స్పిరిట్ సీసాల్లో నింపి బాట్లింగ్ చేసే మిషన్, రంగులు, మూతలు, పెద్ద ఎత్తున ముడి సరుకు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు డిసి చెప్పారు. అసిస్టెంట్ కమిషనర్ కె.ప్రభు కుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, అసిస్టెంట్ ఇఎస్, అజయ్ సింగ్, ప్రసాద్ రెడ్డి, సిఐ పాల్గొన్నారు.

గుడ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థినులకు అవగాహన

మొగల్తూరు: ముత్యాలపల్లిలో బండి ముత్యాలమ్మ జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థినులకు గుడ్, బ్యాడ్ టచ్‌పై ఎస్ఐ వై.నాగలక్ష్మి అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.రామరాజు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో విద్యార్థినులకు సైబర్ క్రైమ్, ఫోక్సో, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ తదితర వాటిపై అవగాహన కల్పించారు. పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

చేనేత సంఘాలకు
రూ.119.98 లక్షలు అందించేందుకు ప్రతిపాదన

కలెక్టర్ చదలవాడ నాగారాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలోని 15 చేనేత సంఘాలకు రూ.119.98 లక్షలు అందించేందుకు జిల్లా సహకార బ్యాంకుకు ప్రతిపాదనలు చేసినట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ అధ్యక్షతన కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో 2025-26 గాను జిల్లాలోని చేనేత సహకార సంఘాలకు నగదు పరపతి మంజూరుకు ప్రతిపాదనలపై చర్చించి డిసిసిబి బ్యాంకుకు సిఫార్సు చేయడం జరిగింది. ఈ నగదు పరపతిని ఉపయోగించి చేనేత సహకార సంఘాలు తమ సభ్యులకు నిరంతర పని ద్వారా ఉపాధి కల్పించడం జరుగుతుందని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో 11 చేనేత సహకార సంఘాలకు రూ.93.88 లక్షల నగదు పరపతిని డిసిసిబి బ్యాంకు ద్వారా మజూరు చేయడం జరిగిందని గుర్తు చేశారు. సమావేశంలో చేనేత, జౌళి శాఖ ఉప సంచాలకులు బి.ధనుంజయ రావు, జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి కె.అప్పారావు, టెక్నికల్ సూపరింటెండెంట్ వివర్స్ సర్వీస్ సెంటర్ ఢిల్లీ రావు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు

వైద్యాధికారులతో ఎంఎల్ఎ రాధాకృష్ణ సమీక్ష

ప్రజాశక్తి - తణుకు

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులను అరికట్టడంతోపాటు దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సంబంధిత వైద్యాధికారులను ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదేశించారు. మంగళవారం ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని తణుకు అర్బన్‌తోపాటు తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాలకు చెందిన పిహెచ్‌సి, సిహెచ్‌సి వైద్యాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడారు. గ్రామాలు, పట్టణాల్లో దోమల నివారణకు సంబంధించి యాంటీ లార్వా పిచికారీ చేయడంతోపాటు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఎంపిడిఒలు, పంచాయతీ కార్యదర్శులు ఆయా గ్రామాల్లో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బందితోపాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హామీల అమలుకు ఉద్యమించాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

ప్రజాశక్తి - తణుకు

అధికారమే లక్ష్యంగా ఎన్నికల ముందు ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి, వాటి అమల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను నిరసిస్తూ హామీల అమలుకు సిపిఐ శ్రేణులు నిరంతర పోరాటాలకు సమాయత్తం కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. మంగళవారం తణుకు వంకా సత్యనారాయణ సురాజ్య భవన్‌లో జరిగిన సిపిఐ తణుకు పట్టణ 16వ మహాసభలో భీమారావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహాసభకు సిపిఐ పట్టణ సమితి సభ్యుడు బండి సత్యనారాయణ అధ్యక్షత వహించారు. భీమారావు మాట్లాడుతూ పేదరికం, దారిద్ర్యం లేని ఆర్థిక అసమానతలు కుల, మత విభేదాలు లేని సమసమాజ నిర్మాణమే లక్ష్యంగా సిపిఐ ఆవిర్భవించిందన్నారు. కేంద్రంలోని బిజెపి మతతత్వ విధానాలతో లౌకిక రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పేదలకిచ్చిన ఇళ్ల స్థలాల హామీతోపాటు సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆగష్టు 6, 7 తేదీల్లో ఉండిలో జరగనున్న సిపిఐ 26వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని భీమారావు కోరారు. అనంతరం పట్టణంలో సిపిఐ కార్యకర్తలు ప్రదర్శన నిర్వహించారు. తొలుత సిపిఐ పతాకాన్ని జిల్లా కార్యవర్గ సభ్యురాలు సికిలే పుష్పకుమారి ఆవిష్కరించారు. సిపిఐ పట్టణ కార్యదర్శిగా బొద్దాని నాగరాజు, కోశాధికారిగా గుబ్బల వెంకటేశ్వరరావు తదితరులు ఎన్నికయ్యారు.

డిఎస్‌సి పరీక్షకు 1409 మంది హాజరు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో మెగా డిఎస్‌సి పరీక్ష ఐదు కేంద్రాల్లో మంగళవారం కొనసాగింది. ఉదయం సెషన్లో 584 మంది అభ్యర్థులకు గాను 482 మంది పరీక్షకు హాజరు కాగా 102 మంది గైర్హాజరయ్యారు. రెండో సెషన్‌లో 585 మందికి గాను 458 మంది అభ్యర్థులు హాజరు కాగా 127 మంది గైర్హాజరయ్యారు. మూడో సెషన్‌లో 585 మందికి గాను 469 మంది హాజరు కాగా 116 మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 1,754 మంది పరీక్షకు హాజరు కావాల్సిన 1,409 మంది హాజరయ్యారు. సుమారు 345 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలో 80.33 శాతం హాజరు నమోదైంది. ప్రశాంత వాతావరణంలో పరీక్ష జరిగిందని జిల్లా విద్యాశాఖ అధికారి ఇవివిఎన్ఎస్-ఎస్ఎస్‌బిఎల్.నారాయణ తెలిపారు.

సోషల్ మీడియా వార్తల్లో నిజం లేదు

విద్యార్థిపై దాడిపై స్పందించిన జిల్లా ఎస్‌పి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

బస్సులో వెళ్తున్న విద్యార్థిపై దాడి చేసినట్లు సోషల్ మీడియాలో పెట్టడంతోనే అలజడి రేగిందని దీనిపై రాష్ట్ర మంత్రి నారా లోకేష్ తనతో మాట్లాడారని జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి అన్నారు. మంగళవారం స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఎస్‌పి మాట్లాడారు. మావుళ్లమ్మ జాతర సందర్భంగా జరుగుతున్న ఊరేగింపులో జంపా మారుతీ శ్రీరామ్, ఆయన స్నేహితులు పాల్గొన్నారని, ట్రాఫిక్ జామ్ కావడంతో స్కూల్ బస్సు అక్కడ ఆగిందని తెలిపారు. అయితే ఆ బస్సులో ప్రయాణిస్తున్న తన స్నేహితుడు పెనిహాస్ చేతిపై సరదాగా మారుతి శ్రీరామ్ కొట్టి వెళ్లిపోయాడని తెలిపారు. అయితే అతని పక్కన కూర్చున్న స్నేహితుడు రవికుమార్ తన ఫ్రెండ్‌ను ఎందుకు కొట్టారని అడగడానికి బస్సు దిగి వెళ్లాడని తెలిపారు. దీంతో మారుతి శ్రీరామ్‌తో పాటు ఉన్న వడ్డాది సాయి, బులి శెట్టి వేణుగోపాల్ మరో నలుగురు రవికుమార్‌ను కొట్టారని తెలిపారు. సోషల్ మీడియాలో గంజాయి, మద్యం మత్తులో బ్లేడ్ బ్యాచ్ హల్‌చల్ చేస్తున్నారంటూ వచ్చిన వార్తల్లో నిజం లేదన్నారు. బాలురల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. అయితే సోషల్ మీడియాలో వీడియోను మార్ఫింగ్ చేసి పెట్టడం వల్లే ఇంత అలజడి రేగిందని తెలిపారు. ఈ సమావేశంలో డిఎస్‌పి జె.సూర్య, వన్ టౌన్ సిఐ నాగరాజు పాల్గొన్నారు

నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణ చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - కాళ్ల

నిర్దేశించిన లక్ష్యాలు సాధించకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మంగళవారం పెదఅమిరంలో కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గృహ నిర్మాణ ప్రగతిపై కలెక్టర్ మండలాలవారీగా సంబంధిత అధికారులతో సమీక్షించారు. క్షేత్రస్థాయిలో లబ్ధిదారులను కలిసి వారికి అవగాహన కల్పించాలని సూచించారు. గృహ నిర్మాణశాఖ అధికారులు పాల్గొన్నారు.

తరగతులు వేరే చోట నిర్వహిస్తే ఊరుకోం

భాష్యం స్కూల్ వద్ద తల్లిదండ్రుల ఆందోళన

నరసాపురం: నరసాపురం భాష్యం స్కూల్ వద్ద మంగళవారం సాయంత్రం తల్లిదండ్రులు ఆందోళనకు దిగడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా పాఠశాలలో ఎల్‌కెజి, యుకెజి తరగతులను స్కూల్ యాజమాన్యం స్కూల్ ప్రాంగణంలో కాకుండా మరోచోట నిర్వహించడంపై తల్లిదండ్రులు ప్రిన్సిపల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రిన్సిపల్ సమాధానం చెప్పకుండా ఫీజు మొత్తం కట్టేశారా అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రిన్సిపల్ ఎవరికి చెప్పి పిల్లలను వేరే చోటికి మార్చారో సమాధానం చెప్పాలని నిలదీశారు. ఎట్టి పరిస్థితిల్లో మా పిల్లల్ని వేరే చోటికి తరలించడం కుదరదని, ప్రిన్సిపల్ క్షమాపణ చెప్పాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. వేరే చోట తరగతులు నిర్వహించిన చోట ప్రమాదకరంగా వర నుయ్యి ఉందని, కనీసం స్కూల్లో బ్లాక్ బోర్డులు, వాష్ రూమ్స్, సెక్యూరిటీ లేదని తెలిపారు. ప్రిన్సిపల్ క్షమాపణ చెప్పి పిల్లలని ఇదే బిల్డింగ్‌లో ఉంచు తామని చెప్పడంతో వివాదం సద్దు మణిగింది.

వివి.గిరికి నివాళి

ఆకివీడు: స్వాతంత్ర ఉద్యమంలో తనతో పాటు కార్మికులను తీసుకొచ్చిన ఘనత నాటి రాష్ట్రపతి వివి గిరికి దక్కుతుందని వివి గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె.సుజాత అన్నారు. వివి గిరి వర్ధంతి సందర్భంగా దుంపగడపలో వివి గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం సిబ్బంది విద్యార్థులు ఆయన కాంస్య విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సుజాత మాట్లాడారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మరియమ్మకు నిత్యావసరాలు అందజేత

పాలకొల్లు రూరల్: పూలపల్లి గ్రామానికి చెందిన పాలపర్తి మరియమ్మకు వైసిపి మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కర్రా జయసరిత నిత్యవసర సరుకులను అందజేశారు. మరియమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంచానికి పరిమితమైంది. ఈ విషయాన్ని గ్రామస్తుల ద్వారా తెలుసుకున్న జయ సరిత పేదలకు ఎంతో కొంత సహాయపడాలని నిత్యవసర సరుకులు పంపిణీ చేసినట్లు తెలిపారు. వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు జోగాడ ఉమామహేశ్వరరావు, వైసిపి వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి ఉనికల శ్రీనివాస్, జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి దేవ రాజేష్, నాయకులు పాల్గొన్నారు.

నరేష్‌బాబుకు పయనీర్ అవార్డు

పాలకొల్లు : హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో పుడమి సాహిత్య వేదిక ఆధ్వర్యంలో పయనీర్ నేషనల్ అవార్డ్స్ -2025 కార్యక్రమం మంగళవారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాలకొల్లుకు చెందిన చవాకుల ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా సమాజానికి చేస్తున్న సేవలకు చవాకుల నరేష్ బాబుకు పయనీర్ నేషనల్ అవార్డును సాహిత్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు చిలుములు బాల్రెడ్డి అందజేశారు. సభికులు నరేష్ ను ఘనంగా సత్కరించి, మెమెంటో అందజేశారు.

పాఠశాలకు టేబుల్, కుర్చీ బహూకరణ

పాలకొల్లు : పట్టణానికి చెందిన తెలనాకుల కిరణ్ కుమార్ పందిగుంట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు 10 వేల రూపాయల విలువైన టేబుల్, కుర్చీని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా దాతకు, ప్రోత్సాహం అందించిన పాలకొల్లు వాకర్స్ క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్ మాస్టార్‌కు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నిల్లా సురేష్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు.

కౌలు గుర్తింపు కార్డుల ప్రక్రియను వేగవంతం చేయాలి

నరసాపురం: ప్రభుత్వం నిర్దేశించిన మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో కౌలు రైతుల గుర్తింపు కార్డుల అందజేత ప్రక్రియను వేగవంతం చేయాలని ఆర్‌డిఒ దాసిరాజు అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికి ఎంత మేరకు కౌలు రైతుల గుర్తింపు కార్డులు అందజేశారు. ఇంకా ఎంత వరకు అందజేయాలనే అంశాలను గ్రామాల వారీగా సమీక్షించారు. సమావేశంలో తహశీల్దార్ ఐవివి సత్యనారాయణ, తహశీల్దార్ కార్యాలయ పర్యవేక్షకులు ఎన్‌విఎస్ఎస్.ప్రసాద్, రీసర్వే డిటి వి.కిషోర్ కుమార్, వ్యవసాయశాఖాధికారి జ్యోషిలా పాల్గొన్నారు.

ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా పేదలకు వరం

పోడూరు: ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పేదలకు గొప్ప వరమని పోడూరు ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు అన్నారు. పోడూరులో ఇటీవల అనారోగ్యంతో మరణించిన గుడాల రాజేష్‌బాబు కుటుంబానికి ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన ద్వారా మంజూరైన రూ.2 లక్షల చెక్కును గ్రామ ప్రముఖులు, మాజీ సర్పంచి రుద్రరాజు వరహాలరాజు చేతుల మీదుగా లబ్ధిదారు (నామిని) గుడాల వెంకటేశ్వరరావుకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ సామాజిక భద్రతా పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ జోనల్ ఆఫీస్ రాజమండ్రి నుంచి వచ్చిన ఫైనాన్షియల్ ఇంక్లూషన్ సీనియర్ మేనేజర్ అజ్జల నరేష్ కుమార్ మాట్లాడారు.

CHANGE OF NAME

I, **DOLLA SANTHA RAJU** S/o Dolla Muniyya, D.No. 13-46/1, Nakkavaripalem, Mogaltur, Mogaltur Mandal, W.G.Dt, A.P.- I have changed my name from **DOLLA SANTI RAJU** (Old name) to **DOLLA SANTHA RAJU** (New name) hence forth I am being called **DOLLA SANTHA RAJU** S/o Dolla Muniyya, for all purposes.